క్లుప్తంగా

మురుగుకాలువ తవ్వకం పనుల ప్రారంభం



కొప్పర్రులో డ్రైయిన్ తవ్వకం పనులు చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: గత కొంత కాలంగా మొగల్తూరు మురుగునీటి కాలువ గుర్రపు డెక్క, సిల్టుతో పూడుకుపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు ఈ డ్రెయిన్ తవ్వకం పనులు చేపట్టారు. జిన్నూరు కాలువ నుంచి మొగల్తూరు వరకూ ఈ డ్రెయిన్ సుమారు 24 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వేలాది ఎకరాల ఆయకట్టు ఈ డ్రెయిన్ వెంబడి సాగవుతుంది. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ తవ్వకం పనులు చేపట్టారు. ప్రస్తుతం నరసాపురం మండలం కొప్పర్రు గ్రామంలో ఈ డ్రెయిన్ తవ్వకం పనులు కొనసాగుతున్నాయి.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



పోతురాజు యాకోబు

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోతురాజు యాకోబు డిమాండ్ చేశారు. గురువారం మొగల్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

సూర్యనారాయణకు ఘన నివాళి



సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, వాసవీక్లబ్, పెన్షనర్స్ అసోసియేషన్, స్టాంప్స్ అండ్ కాయిన్ కలెక్షన్ సంఘాల నిర్వాహకుడు, రిటైర్డు బ్యాంక్ ఉద్యోగి కారుమూరి సూర్యానారాయణ ఆకస్మిక మరణం పట్టణ ప్రజలకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. వైహెచ్ఏఐ, పాలకొల్లు యూనిట్ కార్యాలయంలో గురువారం సూర్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ సేవలను కొనియాడారు. అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సేవ చేస్తూ తీవ్ర గుండెపోటుకు గురై సూర్యనారాయణ మరణించడం బాధాకరమన్నారు. యూనిట్ ఉపాధ్యక్షుడు డా.కేఎస్‌పీఎన్ వర్మ, సాలన సుబ్బారావు, నూలి భాస్కర్, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, ఆచంట సుబ్బారావు, సాలన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజినీనాయుడు జయంతి



డీఎన్నార్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోస్టర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సరోజినీ నాయుడు రచనల్లో భారతదేశ సంస్కృతి ప్రతిబింబిస్తుందని ప్రిన్సిపాల్ డా.శోభారాణి అన్నారు. పాలకొల్లు పట్టణంలోని శ్రీ దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం, నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు జయంతి సందర్భంగా నిర్వహించిన పోస్టర్ ప్రదర్శన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.శోభారాణి మాట్లాడారు. మహిళల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకురాలు సరోజినీ నాయుడు అని గుర్తు చేశారు. ఎన్ఎస్ఎస్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న, డాక్టర్ రమణ, డాక్టర్ స్వరూప్‌సింగ్, డాక్టర్ మణిమాల, మహాలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలపై విచారణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై అభ్యంతరాలను తెలుసుకునేందుకు గురువారం వీరంపాలెం, జగన్నాథపురం, దండగర్ర, కడియద్ద గ్రామ సచివాలయాల వద్ద సీసీఎల్ఏ అడిషనల్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. శ్రీనివాస్ (అమరావతి) విచ్చేశారు. ఈ సందర్భంగా అభ్యంతరాలపై విచారణ చేపట్టారు. ఆ వివరాలను నమోదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

నత్తనడకన రోడ్ల మరమ్మతులు



అధ్వానంగా ఉన్న నత్తారామేశ్వరం- మల్లిపూడి రోడ్డు



గోతులతో ఉన్న జుత్తిగ వెలగలవారిపాలెం రోడ్డు



మొక్కుబడిగా మరమ్మతులు చేసిన పాదలాడ- జుత్తిగ రోడ్డు

- నెలల తరబడి మరమ్మతుల మాయ
- ఇంకా పూర్తికాని వైనం

పెనుమంట్ర: మండలంలో రోడ్లు భవనాల శాఖకు చెందిన రోడ్ల మరమ్మతులకు లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ పనులు మొక్కుబడిగా నత్తనడకన సాగుతున్నాయి. సంక్రాంతి నాటికి రోడ్ల పనులను పూర్తి చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. సంక్రాంతి వెళ్లి నెల గడుస్తున్నా గ్రామాల్లో మరమ్మతులు చేస్తూ ఉన్నారు. అలాగే ఈ పనులు కూడా నాణ్యతా లోపంతో చేయడంతో రెండు మూడు రోజులకే దుమ్ముతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

నిధుల మంజూరు ఇలా

మండల పరిధిలో పాలమూరు-పాదలాడ(వెలగలవారిపాలెం మీదుగా) రోడ్డుకు రూ 40 లక్షలు, బ్రాహ్మణచెర్వు-పాలమూరు రోడ్డుకు రూ. 15 లక్షలు, మల్లిపూడి-నత్తారామేశ్వరం రోడ్డుకు రూ. 10లక్షలు, నత్తారామేశ్వరం-మల్లిపూడి రోడ్డుకు రూ. 15 లక్షలు, పాదలాడ-జుత్తిగ రోడ్డుకు రూ. 15 లక్షలు, వెలగలవారిపాలెం- జుత్తిగ రోడ్డుకు రూ. 6లక్షలు మరమ్మతులు కోసం కేటాయించారు. అదేవిధంగా పాలమూరు- నౌడూరు రోడ్డుకు 80 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించేందుకు రూ. 40 లక్షలు కేటాయించారు. సీసీరోడ్డు నిర్మాణ పనులు నేటికీ ప్రారంభంకాకపోగా, మరమ్మతుల పనులు మాత్రం నాణ్యతా లోపంతో చేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రూ. 10 లక్షలతో నిర్మించే నత్తారామేశ్వరం- మల్లిపూడి రోడ్డు, రూ. 6లక్షలతో నిర్మించే వెలగలవారిపాలెం- జుత్తిగ రోడ్డు నేటికీ పనులు ప్రారంభంకాలేదు. మరమ్మతులు చేసిన రోడ్లు అప్పుడే రాళ్లలేచి ప్రయాణికులకు ఇబ్బందులను కలుగజేస్తున్నాయి.

పనుల ప్రారంభం ఎప్పుడో?



నత్తారామేశ్వరం- మల్లిపూడి రోడ్డు నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో నత్తారామేశ్వరం నుంచి మల్లిపూడి వెళ్లే ప్రయాణికులు అనేక అవస్థలు పడాల్సివస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అత్తిలి నుంచి మల్లిపూడి నత్తారామేశ్వరం లింకు రోడ్డు వరకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించారు. నత్తారామేశ్వరం నుంచి మల్లిపూడి వరకు మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

– కర్రి రామలింగేశ్వరరెడ్డి, నత్తారామేశ్వరం

నిధులు మంజూరైనా తాత్సారం



వెలగలవారిపాలెం–జుత్తిగ రహదారికి మరమ్మతులు నిమిత్తం నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. దీంతో బ్రాహ్మణచెర్వు నుంచి జుత్తిగ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోస్తనీ కెనాల్ రోడ్డు కావడంతో రాళ్ల రోడ్డులో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి. పాలమూరు- పాదలాడ రోడ్డుకు మరమ్మతులు చేసినప్పటికీ నాణ్యతాలోపంతో రోడ్డు రాళ్లు లేచిపోతున్నాయి.

– వెలగల కనికిరెడ్డి, వెలగలవారిపాలెం

చికెన్ వ్యాపారులు పరిశుభ్రత పాటించాలి



ఎం.అంజయ్య

నరసాపురం: చికెన్ వ్యాపారులు దుకాణాల్లో పూర్తి పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బర్డ్‌ఫ్లూ హెచ్చరికల నేపథ్యంలో చికెన్ వ్యాపారులు చేతికి గ్లౌజులు ధరించాలని పేర్కొన్నారు. దుకాణాల్లో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. లేదంటే దుకాణాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాగ్రత్త చర్యల్లో భాగంగా కొన్నిరోజులు చికెన్ కొనుగోళ్లకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని, అయితే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమనని పేర్కొన్నారు.

పథకాలకు అనుమతి వస్తేనే దరఖాస్తులు తీసుకోవాలి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు

యలమంచిలి: ప్రభుత్వ పథకాల అమలుకు అనుమతి వచ్చినపుడే అధికారులు లబ్ధిదారుల నుంచి దరఖాస్తు తీసుకోవాలని, అంత వరకు దరఖాస్తులను ప్రోత్సహించవద్దని ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో జరుగుతున్న పథకాల అమలు తీరును వివరిస్తుండగా సభ్యులు పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు తదితర పథకాల మంజూరు గురించి ప్రశ్నించారు. సంబంధిత శాఖల అధికారులు బదులిస్తూ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని, ప్రభుత్వ అనుమతి వచ్చిన తరువాత మంజూరు చేస్తామని బదులిస్తుండటతో ఎంపీపీ గొల్లపల్లి ఆక్షేపణ వ్యక్తం చేశారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటే వారంతా అవి ఎప్పుడు వస్తాయా? అంటూ ఎదురుచూస్తూ నిరీక్షిస్తుంటారన్నారు. తీరా ప్రభుత్వ అనుమతి ఇచ్చిన అధికారులు మళ్లీ దరఖాస్తులు ఇవ్వమంటారని అభ్యంతరం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ పథకాల అమలుకు అనుమతులు వచ్చిన తరువాతే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. సమావేశంలో ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్వీత మాట్లాడుతూ ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్, సూర్య ఘర్, ఉపాధి హామీ పథకంలో కొబ్బరి రైతులకు ఉన్న పథకాలు గురించి వివరించారు. మండలంలోని మేడపాడు గ్రామంలో ఒక కోళ్ల ఫారమ్‌లో బర్డ్ ఫ్లూ రావడంతో ఆ గ్రామంలో కోడిమాంసం నిషేధించాలని, మండలంలోని ఇతర గ్రామాలలో కూడా కోడి మాంసం వాడకాన్ని తగ్గించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఆమె కోరారు. దొడ్డిపట్ల పీహెచ్‌సీ హెల్త్ విజిటర్ ఎస్.నిర్మలాకుమారి మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో ఎన్‌సీడీ సీడీ సర్వే చేస్తున్నారన్నారు. ఈ సర్వేలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి 146 ప్రశ్నలు ఉంటాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఓపికగా ఈ సర్వేలో పాల్గొనేలా స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సర్వే పూర్తి చేసిన తరువాత వివరాలన్నీ ఆన్‌లైన్ చేస్తామన్నారు. సర్వే చేయించుకున్న వారికి భవిష్యత్‌లో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన సర్వే రిపోర్టు చూసి వైద్యం చేయడం తేలిక అవుతుందన్నారు. మిగిలిన శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో అమలు చేస్తున్న పథకాల వివరాలను సభ్యులకు వివరించారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలి



హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న సంఘ నాయకులు

నరసాపురం: పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నరసాపురంశాఖ డిమాండ్ చేసింది. గురువారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ కేంద్రాలుగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం హాస్టల్ విద్యార్థుల సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కళాశాల హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలు, పాఠశాల విద్యార్థులకు రూ.2500లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ చార్జీలు బాలికలకు రూ.1000, బాలురకు రూ.700 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ డివిజన్ అధ్యక్షుడు పుల్లూరి రాంప్రసాద్, వై.సాయి, జి.సతీష్, సీహెచ్ సంతోష్, సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ-సర్వే దోహదం



నరసాపురం రూరల్: మల్లవరంలో సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



నరసాపురం: తహసీల్దార్లతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నరసాపురం రూరల్: ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న రీ-సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లవరంలో జరుగుతున్న రీ-సర్వే పనులను గురువారం ఆయన పరిశీలించి రీ-సర్వే చేస్తున్న సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూ-యజమానులకు ముందుగా నోటీసులు అందజేసి వారి సమక్షంలో రీ-సర్వే పనులు చేస్తున్నామన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రీ-సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కరుణ్‌కుమార్, రీ-సర్వే డీటీ వర్ధనపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో సమీక్ష

నరసాపురం: రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామ సభల్లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జేసీ నరసాపురం ఆర్డీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ రెవెన్యూ సదస్సులు, రీసర్వే 22-ఏ ఇళ్లస్థలాల క్రమబద్ధకరణ అంశాలపై నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, మొగల్తూరు తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారం మొదటి ప్రాధాన్యతగా పని చేయాలని సూచించారు. నమోదైన అర్జీలను క్రమపద్ధతిలో పరిష్కరించి తమకు ఎప్పటికప్పుడు నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసి రాజు తదితరులు ఉన్నారు.

రాయితీలు పొందాలంటే గుర్తింపు సంఖ్య తప్పనిసరి



తెగులు సోకిన పంట

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రాయితీ పథకాలు రైతులకు అందాలంటే తప్పని సరిగా 14 అంకెల గుర్తింపు సంఖ్య రైతులు నమోదు చేయించుకోవాలని నరసాపురం ఏడీఏ ఈదా అనిలకుమారి అన్నారు. గురువారం నరసాపురం మండలం సీతారామపురం, రుస్తుంబాద గ్రామాల్లోని పంట పొలాలను ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు గుర్తింపు సంఖ్యను కలిగి ఉండడంతో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవం, పంట నష్ట పరిహారం, బీమా, వ్యవసాయ యాంత్రీకరణ, మొదలైన పథకాలకు సంబంధించిన రాయితీలకు రైతులు అర్హులవుతారన్నారు. పంట పొలాలకు కాండం తొలుచు పురుగు, మొవ్వు తెగులు పురుగు ఎక్కువగా ఆసించినట్లు గుర్తించామన్నారు. వీటి నివారణకు హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి వాడాలన్నారు. పాడతెగులు, అగ్గితెగులు కూడా పంటను ఆశించిందని, వీటి నివారణకు ఎకరానికి 200 మిల్లీ లీటర్ల మందును పిచికారీ చేయాలన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును ఎకరాకు 120 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఈమె వెంట వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీనారాయణ, వీఏఏ సురేష్‌కుమార్, వీఏఏ శ్రీనివాస్‌దొర తదితరులు ఉన్నారు.

ప్రేరణాయుతమైన విద్యాబోధన అవసరం



నైపుణ్యాభివృద్ధి సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచే విధంగా ప్రేరణాయుతంగా అధ్యాపకుల బోధన ఉండాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ అధ్యాపకులు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి అన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సౌజన్యంతో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ, పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల సంయుక్తంగా కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి ఐదు రోజుల అవగాహన సదస్సులో గురువారం పాల్గొన్నారు. అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉన్ననాడే సమాజంలో మంచి విద్యార్థులను తయారు చేయగలుగుతారన్నారు. తరగతి గదిలో నిర్మలమైన వాతావరణాన్ని సృష్టించాలన్నారు. అధ్యాపకులు మూల్యాంకణలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఐక్యూసీ కో ఆర్డినేటరు కే శశికుమార్, సదస్సు కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ కేసులో వ్యక్తి అరెస్టు



బెల్ట్ షాపు నిర్వాహకుడితో ఎక్సైజ్ పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో గురువారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యం లో ఎస్సైలు మురళీమోహన్, దొరబాబులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఐదు డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి వివరించారు.


చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ



పాలకొల్లు అర్బన్: లంకలకోడేరులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి



పెనుగొండ: వడలిలో అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



యలమంచిలి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా

పాలకొల్లు అర్బన్: చిన్నారుల పోషణ, ఎదుగుదల విషయంలో అంగన్‌వాడీ వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుజాతరాణి కోరారు. మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ భీ-పడాయి భీ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణను సుజాతరాణి ప్రారంభించారు. ఆరేళ్ల వయస్సులో చిన్నారుల మెదడు ఎదుగుదల చురుగ్గా ఉంటుందన్నారు. చిన్నారులకు ఆట, పాటల ద్వారా విద్యా బోధన చేస్తే వెంటనే గ్రహిస్తారన్నారు. అలాగే చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో రాజీ పడకూడదన్నారు. రుచికరంగా పదార్థాలన్నీ వండి వడ్డించాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.మంగ, పులఖండం సత్యవేణి, క్లస్టర్ లీడర్లు శ్రీదేవి, బీబీ, కనకదుర్గ, సత్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: మండలంలోని వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండ మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ-పడాయి భీ కార్యక్రమంపై శిక్షణనిచ్చారు. గురువారం పిల్లల పోషణ స్థితి, వారి విద్య ఏ విధంగా మెరుగుపర్చాలనే అంశంపై శిక్షణనిచ్చారు. శిక్షణ తరగతులు 15 వ తేదీ వరకూ కొనసాగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.సుజాత, వీఎంఎం రూతు కుమారి, ఎంఈఓ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీలు

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగానే కాకుండా విద్యను అందించే కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పోషన్ భీ-పఢాయి భీ కార్యక్రమం చేపట్టిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. ఈ కార్యక్రమంపై గురువారం యలమంచిలి, కొంతేరు హైస్కూల్స్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.